# రైతులకు ఇబ్బంది కలగకుండా యూరియా విక్రయించాలి





**బోధన్, నిజామాబాద్ జిల్లా డిసెంబర్ 30(డీడీ9 వార్త) :** రైతులకు యూరియా విక్రయించే సమయంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు, సహకార సంఘాల సెక్రటరీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని క్లస్టర్ ఆఫీసర్ అనుపాల రవీందర్, మండల వ్యవసాయ అధికారి సంతోష్ ఆదేశించారు. మంగళవారం బోధన్ పట్టణంలోని రైతు వేదికలో ఏఈఓలు, 11 సహకార సంఘాల సెక్రటరీలు, సేల్స్‌మెన్లతో యూరియా అమ్మకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం ప్రతి యూరియా సేల్ పాయింట్ వద్ద ఎండ నుంచి రక్షణకు టెంట్లు, రైతులకు తాగునీటి సదుపాయాన్ని కచ్చితంగా ఏర్పాటు చేయాలన్నారు. ఎరువుల కోసం వచ్చే ప్రతి రైతు నుంచి పట్టా పాస్ పుస్తకం మరియు ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను తప్పనిసరిగా సేకరించాలని సూచించారు. సొసైటీలలో యూరియా నిల్వలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, స్టాక్ తక్కువగా ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించి ఇండెంట్ పెట్టి తెప్పించుకోవాలని స్పష్టం చేశారు. సేల్ పాయింట్లలో నిర్ణీత సమయాలను పాటించాలని, విక్రయాల విషయంలో పారదర్శకత ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బోధన్, పెంటకలన్, పెంటకుర్దు, మినార్ పల్లి, అందాపూర్, జాడి జమాల్ పూర్, హుంస, సాలూర, కల్దుర్కి, సాలంపాడ్, సంఘం సహకార సంఘాల సెక్రటరీలు, సేల్స్‌మెన్లు మరియు వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల





**బోధన్, నిజామాబాద్ జిల్లా డిసెంబర్ 30(డీడీ9 వార్త) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, మహాత్మా జ్యోతిబాపూలే (బీసీ) వెనుకబడిన తరగతుల సంక్షేమ మరియు సాధారణ గురుకుల పాఠశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల ప్రకటన వెలువడింది. 5వ తరగతిలో పూర్తి సీట్లు, 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి 'టిజిసెట్-2026' ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు బోధన్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఇంచార్జి ప్రధానాచార్యులు ఎన్.రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి ప్రవేశానికి ప్రస్తుతం 4వ తరగతి, ఇతర తరగతుల ప్రవేశానికి సంబంధిత తరగతులు ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతుండాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 2 లక్షలకు మించకూడదు. ఆసక్తి గల విద్యార్థులు రూ. 100/- ఫీజు చెల్లించి జనవరి 21 లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు. పరీక్ష 22-02-2026 న ఉదయం 11 నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు అన్ని జిల్లాల కేంద్రాల్లో పరీక్ష జరుగుతుందని, దరఖాస్తుకు అభ్యర్థి పాస్‌పోర్ట్ సైజు ఫోటో, బోనఫైడ్, కుల, ఆదాయ మరియు పుట్టిన తేదీ ధృవీకరణ పత్రాలు అవసరమని ఆయన పేర్కొన్నారు. అర్హులైన వెబ్‌సైట్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# స్విమ్మింగ్‌లో రాణించిన పోలీస్ పిల్లలకు సీపీ సన్మానం



**నిజామాబాద్ జిల్లా డిసెంబర్ 30(డీడీ9 వార్త) :** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ముగ్పాల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పీసీ హరికృష్ణ సంతానమైన మధి మోహన్ దుర్గ, మధి వినమ్ర ఇటీవల రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. వీరి ప్రతిభను గుర్తిస్తూ నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మంగళవారం కమిషనర్ కార్యాలయంలో వారిని ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాకు పతకాలు తీసుకురావడం ఎంతో గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు. కష్టపడి సాధించిన ఈ విజయం రాష్ట్రస్థాయిలో జిల్లాకు మంచి పేరు తెచ్చిందని కొనియాడారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించి తెలంగాణ రాష్ట్ర కీర్తిని చాటాలని ఆకాంక్షించారు. క్రీడల పట్ల ఆసక్తి ఉన్న పోలీస్ సిబ్బందికి మరియు వారి కుటుంబ సభ్యులకు తమ కార్యాలయం నుండి అన్ని రకాల సహాయ సహకారాలు, ప్రోత్సాహకాలు ఉంటాయని హామీ ఇచ్చారు. ఏదైనా సమస్య ఉన్నా లేదా సలహాలు కావాలన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రీడలు, స్విమ్మింగ్ వంటి ఆరోగ్యకరమైన అలవాట్లకు సమయం కేటాయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) జి.బస్వా రెడ్డి, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి, సౌత్ రూరల్ సి.ఐ ఎన్. సురేష్ కుమార్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిమ్మాపూర్ టిటిడీలో ఘనంగా ఉత్తర ద్వార దర్శనం

- భారీగా తరలివచ్చిన భక్తులు










**బాన్సువాడ,డిసెంబర్30(డిడి9 వార్త):** వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని బాన్సువాడ నియోజకవర్గంలోని బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలోని తెలంగాణ తిరుమల దేవస్థానం లో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తర ద్వార దర్శనంతో శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాస రెడ్డి, అలాగే మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకొని నియోజకవర్గం నలుమూలల నుండి భక్తులు భారీగా తరలివచ్చి ఉత్తర ద్వార దర్శనం చేసుకుని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ప్రత్యేక అలంకరణలు, పూజా కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొలహరిలో జాతీయ సేవా పథకం శీతాకాల శిబిరం ఏర్పాటు.








**బజార్ హత్నూర్, డిసెంబర్ 30,(డిడి9వార్త):-** బజార్ హత్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ ఎస్ ఎస్) యూనిట్ మంగళవారం రోజు ఎన్ ఎస్ ఎస్ శీతాకాల శిబిరంలో భాగంగా 4 వ రోజు కొలహరి గ్రామంలోని పులాజీ బాబా ధ్యానమందిరం ఆవరణలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ రోజు ప్రధాన అంశాలు మహిళా సాధికారత, బాలికల విద్యా హక్కులు, బాల్య వివాహ నిరోధక చట్టం పై అవగాహన కల్పించారు.
ఈ శిబిరం వారం రోజులుగాకొనసాగుతుందని ఎన్నికల కంటే ముందు మూడు రోజులుఈ శీతకాల శిబిరం పూర్తి అయినదని ఈ రోజుతో నాలుగవ దినం జనవరి రెండవ తేదీతో శిబిరం పూర్తిఅవుతుంది. ఆ రోజు కార్యక్రమంలో శిక్షణ పొందినవిద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వనున్నామనికార్యక్రమ నిర్వాహకులుతెలిపారు. ఈ రోజు శిబిరం లోకొలహరి సర్పంచ్ మెండికే సాయినాథ్, బజార్ హత్నూర్కళాశాల అధ్యాపకులు జ్ఞానేశ్వర్, అహ్మద్, బీమేష్విద్యార్థులు పాల్గొన్నారు

# వండ్రికల్ అప్‌పర్ ప్రైమరీ స్కూల్ తనిఖీ

**అవకతవకలపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అసహనం**

పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా, శుభ్రమైన వాతావరణంలో

పంచాయతీ సెక్రటరీ వెంకటాచారికి నోటీసులు జారీ చేయాలని





**కామారెడ్డి, డిసెంబర్ 30(డిడి9 వార్త) :** గాంధారి మండలం వండ్రికల్ గ్రామంలోని మండల అప్పర్ ప్రైమరీ స్కూల్‌ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను వరండాలో కూర్చోబెట్టి తరగతులు నిర్వహిస్తున్న విధానంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు తప్పనిసరిగా తరగతి గదుల్లోనే బోధన జరగాలని అధికారులకు స్పష్టం చేశారు. పాఠశాల ఆవరణ చుట్టూ చెత్తా చెదారం పేరుకుపోయి ఉండటంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న వంటగదిని పరిశీలించిన కలెక్టర్, భోజన నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పోషకాహారం అందేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు ప్రధానోపాధ్యాయునికి నోటీసులు జారీ చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి రాజుకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అలాగే శానిటేషన్ విషయంలో నిర్లక్ష్యం వహించిన పంచాయతీ అధికారి మురళీకి ఆదేశించారు. అలాగే ప్రైమరీ స్కూల్‌లో అందించిన ఫ్రీ స్కూల్ కిట్ మెటీరియల్‌ను చిన్నారులకు వెంటనే అందుబాటులో ఉంచాలని, అన్ని ప్రైమరీ పాఠశాలల్లో ఈ కిట్లు విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ తనిఖీలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, జిల్లా విద్యాశాఖాధికారి రాజు, డిఆర్డివో సురేందర్, డిపివో మురళి, తహసిల్దార్ రేణుక, ఎంపీడీవో, సంబంధిత విద్యాశాఖ అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థుల భద్రతే లక్ష్యంగా ఆటోలు, మినీ క్యాబ్‌లపై విస్తృత తనిఖీలు

**- నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాహనాలు సీజ్**





**కామారెడ్డి, డిసెంబర్ 30(డిడి9 వార్త):** జిల్లాలో ఆటో రిక్షాలు, మినీ క్యాబ్‌లు తదితర వాహనాల ద్వారా ప్రయాణిస్తున్న విద్యార్థుల భద్రతను ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మరియు జిల్లా రవాణా అధికారి ఆదేశాల మేరకు విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించినట్లు రవాణా శాఖ అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో భాగంగా బాన్సువాడ, పిట్లం, తాడ్వాయి, కామారెడ్డి ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాహనాలను గుర్తించి, సహాయక మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు వాటిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా అధికారి మాట్లాడుతూ,' 'విద్యార్థుల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత" అని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపే సమయంలో వారు సురక్షితమైన వాహనాల్లో ప్రయాణిస్తున్నారా అనే విషయాన్ని తప్పనిసరిగా పరిశీలించాలని, రహదారి భద్రతా నియమాలు పాటించేలా రవాణా శాఖకు పూర్తి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.

# ప్రాధాన్యతా రుణాల లక్ష్యాలను సాధించాలి

- పంట రుణాల పంపిణీ, పునరుద్ధరణకు అత్యంత ప్రాధాన్యత
జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్









**కామారెడ్డి,డిసెంబర్ 30(డిడి9 వార్త):**
సెప్టెంబర్ త్రైమాసికం%-%2025కు సంబంధించి డీసీసీ %డి% డిఎల్ఆర్సీ సమావేశం మంగళవారం జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ వ్యవసాయ పంట రుణాలు, వ్యవసాయ టర్మ్ లోన్లు, మౌలిక సదుపాయాల రుణాలు, ఎమ్ఎస్ఎమ్ఈ గృహ రుణాలు, ప్రాధాన్యత లేని రుణాలు తదితర అంశాలపై సమీక్షించారు. ప్రాధాన్యతా రంగంలో నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. ప్రత్యేకంగా పంట రుణాల పంపిణీ మరియు పంట రుణాల పునరుద్ధరణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రైతులకు సమయానుకూలంగా రుణాలు అందేలా బ్యాంకులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఎమ్ఎస్ఎమ్ఈ రుణాల సమీక్షలో పిఎమ్ఈజిపి, పిఎమ్ఎఫ్ఎంఈ పథకాల కింద పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను వెంటనే క్లియర్ చేయాలని స్పష్టం చేశారు.ఎస్ఎచ్జి రుణాల పంపిణీపై సమీక్ష చేస్తూ పిడి డిఆర్డిఏ, పిడి ఎమ్ఈపిఎమ్ఏ ఆధ్వర్యంలోని ఎస్ఎచ్జి రుణాలలో ఎన్పిఏ తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు.అలాగే ఈఎస్ఎస్ కింద ప్రభుత్వ స్పాన్సర్ చేసిన పథకాల కింద ఉన్న అన్ని దరఖాస్తులను ఎటువంటి ఆలస్యం లేకుండా త్వరగా మంజూరు చేయాలని సంబంధిత బ్యాంకులను ఆదేశించారు.ఈ సమావేశంలో డిడిఎమ్ నాబార్డ్ ప్రవీణ్ కుమార్, ఎల్డిఎమ్ జె. చంద్రశేఖర్, జిల్లా అధికారులు, అన్ని బ్యాంకుల కంట్రోలర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# దేశంలో భారీగా తగ్గిన ఏటీఎంల సంఖ్య
## ఆ ఒక్క కారణంతో వేలాదిగా మూసివేత



**హైదరాబాద్, డిసెంబర్ 30(డిడి9వార్త):-**దేశంలో డిజిటల్ చెల్లింపుల వినియోగం భారీగా పెరగడంతో ఏటీఎంల అవసరం క్రమంగా తగ్గుతోంది. 2025 ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా ఏటీఎంల సంఖ్య భారీగా తగ్గిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజాగా విడుదల చేసిన 'ట్రెండ్ అండ్ ప్రోగ్రెస్ ఆఫ్ బ్యాంకింగ్' నివేదికలో వెల్లడించింది. నిర్వహణ ఖర్చులు పెరగడం, ఆన్‌లైన్ లావాదేవీలకు ప్రజలు మొగ్గుచూపుతుండటంతో బ్యాంకులు ఏటీఎంల సంఖ్యను తగ్గించుకుంటున్నాయి.ఆర్‌బీఐ నివేదిక ప్రకారం 2024 మార్చి నాటికి 2,53,417గా ఉన్న ఏటీఎంల సంఖ్య.. 2025 మార్చి 31 నాటికి 2,51,057కు పడిపోయింది. ముఖ్యంగా ప్రైవేట్ రంగ బ్యాంకులు తమ ఏటీఎం నెట్‌వర్క్‌ను భారీగా కుదించుకున్నాయి. గత ఏడాది 79,884గా ఉన్న ప్రైవేట్ బ్యాంక్ ఏటీఎంలు, ఈ ఏడాది 77,117కు తగ్గాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో కూడా ఈ సంఖ్య 1,34,694 నుంచి 1,33,544కు స్వల్పంగా తగ్గింది. ఆఫ్-సైట్ ఏటీఎంల మూసివేత ఇందుకు ప్రధాన కారణమని తెలుస్తోంది.అయితే, బ్యాంకేతర సంస్థలు నిర్వహించే వైట్ లేబుల్ ఏటీఎంల సంఖ్య మాత్రం 34,602 నుంచి 36,216కు పెరగడం విశేషం. ఇక ఏటీఎంల విస్తరణ విషయంలో.. ప్రభుత్వ బ్యాంకులు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సమానంగా సేవలు అందిస్తుండగా, ప్రైవేట్ బ్యాంకులు మాత్రం ఎక్కువగా మెట్రో నగరాలకే పరిమితమయ్యాయి.మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. ఏటీఎంలు తగ్గుతున్నప్పటికీ, బ్యాంక్ బ్రాంచుల సంఖ్య మాత్రం పెరుగుతూనే ఉంది. 2025 మార్చి నాటికి దేశంలో బ్యాంక్ శాఖల సంఖ్య 2.8 శాతం పెరిగి 1.64 లక్షలకు చేరింది. కొత్త బ్రాంచుల ఏర్పాటులో ప్రైవేట్ బ్యాంకుల కంటే ప్రభుత్వ రంగ బ్యాంకులే దూకుడుగా ఉన్నాయని ఆర్బీఐ నివేదిక స్పష్టం చేసింది.

# భక్తి సాగరంలో ఇందూరు ఉత్తర ద్వారం గుండా ముక్కోటి దర్శనం

- చలిని సైతం లెక్కచేయక బారులు తీరిన భక్తులు
- గోవింద నామస్మరణతో పులకించిన ఇందూరు క్షేత్రాలు
- వైకుంఠ ఏకాదశి వేడుకలతో ఆధ్యాత్మిక ఉరకలు
- తెల్లవారుజాము నుంచే వైష్ణవాలయాలకు పోటెత్తిన భక్తజనం
- నగరంలో కలెక్టర్, నర్సింగ్‌పల్లిలో దిల్ రాజు దంపతుల పూజలు















**నిజామాబాద్ జిల్లా డిసెంబర్ 30(డీడీ9 వార్త) :**
ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నిజామాబాద్ జిల్లాలోని వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మంగళవారం తెల్లవారుజాము నుంచే భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి, ఆలయాల వద్ద బారులు తీరారు. 'గోవిందా.. గోవిందా..' అనే నామస్మరణతో ఆలయ ప్రాంగణాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. జిల్లా కేంద్రంలోని జెండా బాలాజీ మందిరం, గంగాస్థాన్ ఉత్తర తిరుపతి, చక్రం గుడి, సుభాష్ నగర్ రామాలయం, డిచ్‌పల్లి రామాలయాల్లో ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు వేలాదిగా తరలివచ్చారు.నిజామాబాద్ నగరంలోని జెండా బాలాజీ ఆలయంలో జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నర్సింగ్‌పల్లి ఇందూరు తిరుమల ఆలయంలో జరిగిన వేడుకల్లో ప్రముఖ నిర్మాత దిల్ రాజు దంపతులు, ఆలయ ధర్మకర్తలు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. సుభాష్ నగర్ రామాలయంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన పల్లకీ సేవ, మహిళల దాండియా నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వైకుంఠ ద్వార దర్శనానికి ఉన్న విశిష్టతను గుర్తించి వేకువజామునే భక్తులు ఆలయాలకు తరలివచ్చారు. జెండా బాలాజీ ఆలయం, ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రం, గంగాస్థాన్ ఉత్తర తిరుపతి, డిచ్‌పల్లి రామాలయం, సిరికొండ, కమ్మర్‌పల్లి, బోధన్, ఆర్మూర్, భీంగల్, నవీపేట్, వేల్పూర్, ముప్కాల్ తదితర మండలాల్లోని ఆలయాల్లో ఉత్తర ద్వారం ద్వారా స్వామివారి దర్శనాన్ని కల్పించారు. దర్శనం కోసం భక్తులు గంటల తరబడి బారులు తీరినా ఎక్కడా అసహనం లేకుండా భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. చౌట్‌పల్లిలో నాగశేష వాహనంపై శ్రీ లక్ష్మీనారాయణ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. మైలారం లక్ష్మీ వేంకటేశ్వర ఆలయంలో గోదాదేవి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బోధన్ పట్టణంలోని పలు ఆలయాల్లో భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్నదాన కార్యక్రమాలు, తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు, రోజంతా భజన కీర్తనలతో దైవ ధ్యానంలో గడిపారు. ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకోవడం వల్ల పుణ్యం లభిస్తుందని భక్తులు విశ్వసించారు. ఆలయ అధికారులు, కమిటీ ప్రతినిధులు సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకున్నారు.

# జానకంపేట్ రథం చెరువులో చేప పిల్లల విడుదల

**బోధన్, నిజామాబాద్ జిల్లా డిసెంబర్ 30(డీడీ9 వార్త) :** ఎడపల్లి మండల పరిధిలోని జానకంపేట్ గ్రామంలో గల రథం చెరువులో మంగళవారం మత్స్య శాఖ ఆధ్వర్యంలో చేప పిల్లలను విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి చేపట్టిన కార్యక్రమంలో భాగంగా, జిల్లా మత్స్య అభివృద్ధి శాఖ అధికారుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 25,800 చేప పిల్లలను స్థానిక ప్రజాప్రతినిధులు, మత్స్యకార సంఘం నాయకులు కలిసి చెరువులోకి వదిలారు. ఈ సందర్భంగా మత్స్యకార సంఘం కమిటీ సభ్యుడు దుబాక గంగాధర్ మాట్లాడుతూ.. చెరువుల్లో చేప పిల్లలను విడుదల చేయడం ద్వారా మత్స్యకారుల ఉపాధి మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మత్స్యకారులు వీటిని సంరక్షించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని మత్స్యకార కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అనురాధ కిషన్ గౌడ్, ఉపసర్పంచ్ నీలం కృష్ణ, పంచాయతీ కార్యదర్శి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు వ్యతిరేక విధానాలను వీడాలి బకాయిలు వెంటనే చెల్లించాలి



**బోధన్, నిజామాబాద్ జిల్లా డిసెంబర్ 30(డీడీ9 వార్త) :** రాష్ట్ర ప్రభుత్వం రైతాంగం పట్ల అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నవీపేట్ మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకుడు చిన్న ఒడ్డెన్న మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేముందు రైతులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని విమర్శించారు. వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించి, క్షేత్రస్థాయిలో మాత్రం సవాలక్ష నిబంధనలతో సామాన్య రైతులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. సన్నరకం, దొడ్డురకం అంటూ విభజించి మెజారిటీ రైతులకు బోనస్ అందకుండా కొర్రీలు పెడుతున్నారని ధ్వజమెత్తారు. గత సీజన్‌కు సంబంధించి ఇప్పటికీ వేలాది మంది రైతుల ఖాతాల్లో రైతుబంధు (రైతు భరోసా) నిధులు జమ కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడి సాయం అందక రైతులు అప్పుల పాలవుతున్నారని, విధిలేక వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తూ ఆర్థికంగా కుంగిపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుబంధు బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యూరియా బుకింగ్ కోసం తీసుకొచ్చిన యాప్ విధానం రైతులకు తీవ్ర ఇబ్బందికరంగా మారిందన్నారు. స్మార్ట్ ఫోన్లు లేని రైతులకు ఈ పద్ధతి శాపంగా మారిందని, తక్షణమే దీనిని రద్దు చేసి పాత పద్ధతిలోనే సొసైటీల ద్వారా ఎరువులను సరఫరా చేయాలని కోరారు. రైతుల సమస్యలను పరిష్కరించకుంటే రాబోయే రోజుల్లో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవేందర్ సింగ్, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలు, నేరాల తగ్గింపులో పోలీస్ శాఖ విజయం : సీపీ సాయి చైతన్య వెల్లడి




**నిజామాబాద్ జిల్లా డిసెంబర్ 30(డీడీ9 వార్త) :** పోలీస్ సిబ్బంది అంకితభావం, ప్రభుత్వ విభాగాల సమన్వయం, ప్రజల సహకారంతో నేరాల నియంత్రణకు కృషి చేస్తున్నామని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య తెలిపారు. మంగళవారం పోలీస్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో 2025 సంవత్సరానికి సంబంధించిన వార్షిక క్రైమ్ రిపోర్ట్‌ను ఆయన విడుదల చేశారు. విలేకరుల సమావేశంలో సీపీ మాట్లాడుతూ.. గతేడాదితో పోలిస్తే 2025లో మొత్తం మీదుగా క్రైమ్ రేటు తగ్గినట్లు వెల్లడించారు. గతేడాది మొత్తం 8,983 వివిధ నేరాలు నమోదు కాగా 2025లో అవి 8,624కు తగ్గాయని తెలిపారు. అయితే పిల్లలపై జరిగే నేరాల సంఖ్య గతేడాది 120 ఉండగా, ఈ ఏడాది 168కు పెరిగిందని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో పోలీస్ శాఖ తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయని సీపీ తెలిపారు. బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి నివారణ చర్యలు చేపట్టడంతో ప్రమాదాల సంఖ్యతో పాటు మృతుల సంఖ్య కూడా తగ్గిందన్నారు. గతేడాది 857 రోడ్డు ప్రమాదాలు జరగగా 353 మంది మృతి చెందారని, 2025లో 780 ప్రమాదాల్లో 276 మంది మృతి చెందినట్లు వివరించారు. డ్రంకెన్ డ్రైవ్‌పై ఉక్కుపాదం మోపామని, నిరంతర తనిఖీలతో మంచి ఫలితాలు వస్తున్నాయని సీపీ తెలిపారు. గతేడాది 8,410 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు కాగా, ఈ ఏడాది ఆ సంఖ్య 17,627కు చేరిందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రాణాపాయమని, దీనిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు.డ్రగ్స్‌పై యుద్ధాన్ని మరింత బలంగా కొనసాగిస్తామని సీపీ తెలిపారు. ఇప్పటికే కళాశాలలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, రానున్న రోజుల్లో వీటిని విస్తరించనున్నట్లు తెలిపారు. జిల్లా జాతీయ రహదారులకు ఆనుకొని ఉండటంతో అంతర్రాష్ట్ర నేరాలను అరికట్టేందుకు డైనమిక్ పెట్రోలింగ్ చేపడుతున్నామని చెప్పారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు లక్ష్యంగా కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. వరదలు వంటి విపత్తుల సమయంలో తక్షణ సహాయం అందించేందుకు పోలీస్ శాఖ నుంచే డీడీఆర్ఎఫ్ బృందాన్ని సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. న్యూ ఇయర్ వేడుకలపై స్పందిస్తూ, సంబరాలకు పోలీస్ శాఖ అడ్డంకి కాదని, కానీ హద్దులు మీరొద్దని సూచించారు. న్యూ ఇయర్ సందర్భంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు మరింత కఠినంగా నిర్వహిస్తామని, మద్యం సేవించి వాహనాలు నడిపితే రూ.10 వేలకుపైగా జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా విధిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ (అడ్మిన్) జి.బస్వా రెడ్డి, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకటరెడ్డి, బోధన్ ఏసీపీ శ్రీ శ్రీనివాస్, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, సైబర్ క్రైమ్ ఏసీపీ వై.వెంకటేశ్వర్ రావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీశైలం, సీసీఆర్బీ సీఐ వీరయ్యతో పాటు సీఐలు, ఎస్సైలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# వైకుంఠ ఏకాదశి ఎకిటకిట లాడిన కుచులాపూర్ వెంకన్న ఆలయం





**బజార్ హత్నూర్, డిసెంబర్ 30(డిడి9వార్త):-**
వైకుంఠ ఏకాదశి ఉత్తర ముఖ ద్వారాదర్శనంకోసంఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని కుచులాపూర్ కూడలి వద్ద గల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవా లయం వద్ద మంగళవారం రోజు భక్తులతో కిట కిట లాడింది.దేవాలయం కమిటీ వారు వెంకటేశ్వ ర స్వామి, పద్మావతి, మంగమ్మ ఉత్సవ విగ్రహాలు ఉత్తర దిక్కు ద్వారాము వైపున ఉంచి పూజలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించుటకు ఏర్పాట్లు చేశారు. పెద్ద ఎత్తున మహిళలు, పురుషులు మందిరం వద్దకు వాహనాలలో వచ్చి వరుస క్రమంలో నిల్చొని బారులు తీరి గోవిందుని నామ ఉచ్చారనతో క్రమశిక్షణ పాటించారు. భక్తులకు దర్శనం తరవాత అరటిపళ్ళుపంచారుభక్తితోకూడినభజనకార్యక్రమం ఏర్పాటుచేశారు. మహిళలంతా ధ్వజస్తంభం వద్ద టెంకాయలు కొట్టి పూజలు చేసి, దీపాలు వెలిగించారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణం అంతా ఆధ్యాత్మిక చింతనతో మారు మోగింది.ఈ సందర్భంగాపరమాన్నం, అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.